

మహేందర్‌గౌడ్‌ను సన్మానిస్తున్న మాజీ పాలకమండలి సభ్యులు

ఎల్లమ్మ ఆలయం ఈవోగా మహేందర్‌గౌడ్

అమీర్‌పేట, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): బల్కంపేట ఎల్లమ్మ ఆలయం ఈవోగా రెయిన్‌బజార్ ధర్మశాలలో పనిచేస్తున్న మహేందర్‌గౌడ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఈవోగా పనిచేసిన కృష్ణ దీర్ఘకాలిక సెలవులపై వెళ్లారు. ఈ సందర్భంగా మహేందర్‌గౌడ్‌ను ఆలయ మాజీ ధర్మకర్తలు హన్మంతరావు, పోతరాజు కుమార్, బీఆర్ఎస్ నాయకులు వనం శ్రీనివాస్, రణధీర్‌గౌడ్ సన్మానించారు.



అసదుద్దీన్‌ను సత్కరించిన ఆలయ కమిటీ ప్రతినిధులు

భక్తిశ్రద్ధలతో సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

బోరబండ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): బోరబండ బస్టాపు వద్దనున్న శ్రీ షిరిడీ సాయిబాబా ఆలయ 15వ వార్షికోత్సవాలను శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎం.డి.అసదుద్దీన్ ను ఆలయ కమిటీ తరపున సత్కరించారు. అనంతరం జరిగిన అన్నదాన కార్యక్రమాన్ని అసదుద్దీన్ ప్రారంభించారు. కార్యక్రమంలో హనుమాన్ ఆలయ ట్రస్ట్ బోర్డు పాలకమండలి చైర్మన్ పుష్పాకుల ఆనంద్ కుమార్, ఎక్స్అఫీషియో సభ్యుడు శ్రీపెరుంబుదూర్ హేమకేశవాచార్యులు, గుమ్మడిదల సుధాకర్, దూడల రవిగౌడ్, పాలకమండలి ప్రతినిధులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న వైద్య సిబ్బంది, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు

ఆరోగ్యంపై అవగాహన పెంచేందుకు 5కే రన్

హైటెక్ సిటీ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ వెల్‌నెస్ డే సందర్భంగా మెడికవర్ ఆస్పత్రి, టెక్ మహేంద్ర సంయుక్త ఆధ్వర్యంలో హైటెక్ సిటీలో శనివారం 5కే రన్ నిర్వహించారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు, టెక్ మహేంద్ర ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మారిన జీవన శైలి కారణంగా యువత ఆరోగ్యంపై అవగాహన పెంచే లక్ష్యంతో 5 కే రన్ నిర్వహించినట్టుటెక్ మహేంద్ర సీనియర్ వైస్ ప్రెసిడెంట్, గ్లోబల్ డెలివరీ హెడ్ కృష్ణకుమారి, మెడికవర్ ఆస్పత్రి ఏజీఎం శైలజ తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్క నాటుతున్న సి.ఎన్.రెడ్డి

బోరబండ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని రహ్మత్‌నగర్ కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి అన్నారు. ఎస్పీఆర్ హిల్స్ ఆరోగ్యనగర్‌లోని గిరిజన విద్యార్థుల వసతిగృహ ప్రాంగణంలో వార్డెన్ వినోద్ జోషి, కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి శనివారం ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పరిసరాలు, కాలనీల్లోని ఖాళీ ప్రదేశాల్లో మొక్కలునాటి సంరక్షించాలని కోరారు.



శ్రీనివాస్‌రెడ్డిని అభినందిస్తున్న విద్యుత్ అధికారులు

డాక్టరేట్ పొందిన కళ్లెంకు అభినందనలు

బోరబండ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): అమెరికాలోని బర్నింగ్ టన్ స్టేట్ యూనివర్సిటీ నుంచి సామాజిక సేవా రంగంలో డాక్టరేట్ పొందిన విద్యుత్ శాఖ అకౌంట్స్ అధికారి కళ్లెం శ్రీనివాస్‌రెడ్డిని విద్యుత్ సౌధ ఉన్నతాధికారులు శనివారం అభినందించారు. శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో విద్యుత్ సౌధ అకౌంట్స్ విభాగం ఉన్నతాధికారి లక్ష్మీశ్రీ, డిప్యూటీ సీసీఏలు శ్రీనివాస్‌రావు, టి.రమేశ్, చంద్రశేఖర్‌రెడ్డి, సోమయాజులు, దామెర శ్రీనివాస్, సిర్రా ఆనంద్ కుమార్ పాల్గొన్నారు.



రౌండ్‌టేబుల్ స్కూల్‌లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్

● బంజారాహిల్స్, ఆంధ్రజ్యోతి

కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్య



శ్రావణి(ఫైల్)

బేగంపేట, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డలో కుటుంబకలహాలతో ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు జిల్లా తిమ్మాపురం గ్రామానికి చెందిన శ్రావణి(30) ఉపాధి కోసం కుటుంబంతో నగరానికి వచ్చి ఎర్రగడ్డలో నివసిస్తుంది. సమీపంలోని జనప్రియ అపార్ట్‌మెంట్‌లో హౌస్ కీపింగ్ పనులు చేసుకుంటూ ఉపాధి పొందుతుంది. కుటుంబ కలహాల వల్ల మానసికంగా కుంగిపోయిన ఆమె ఉదయం 8.30 గంటల సమయంలో జనప్రియ అపార్ట్‌మెంట్ 5వ అంతస్తు నుంచి కిందకు దూకి ఆత్మహత్య చేసుకుంది. తీవ్రంగా గాయపడిన ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. మృతురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభం ఏర్పాటుకు తవ్వకాలు

● అడ్డుకున్న స్థానికులు.. అధికారులకు ఫిర్యాదు



విద్యుత్ స్తంభాన్ని రోడ్డు మధ్యన వేసేందుకు తీస్తున్న గుంత

బేగంపేట, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): రోడ్డు మధ్యలోని విద్యుత్ స్తంభాలను తొలగించాలని ప్రజలు ఫిర్యాదులు చేస్తే అధికారులు తొలగిస్తుంటారు. బేగంపేట డివిజన్ బ్రాహ్మణవాడిలోని లేన్ నెంబర్.7లో రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని రోడ్డు మధ్యలో వేసేందుకు అధికారులు యత్నించగా స్థానికులు అడ్డుకున్నారు. పక్కన ఉన్న స్తంభాన్ని తీసి రోడ్డు మధ్యలో ఎలా వేస్తారంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమస్యపై స్థానికుల సంతకాలతో పి.కార్తీక్ శనివారం విద్యుత్ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అధికార పార్టీకి చెందిన నాయకుల మెప్పు కోసం రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని రోడ్డు మధ్యలోకి ఎలా మారుస్తారని ఫిర్యాదులో పేర్కొన్నారు. విద్యుత్ స్తంభం మార్పుపై అభ్యంతరాలు ఉండడం వల్ల పనులు ఆపేశామని బేగంపేట విద్యుత్ ఏఈ సాయికుమార్ తెలిపారు.

ఖబరస్తాన్‌లో సమస్యల పరిష్కారానికి కృషి

బేగంపేట, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ఖబరస్తాన్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కోట నీలిమ అన్నారు. శనివారం బేగంపేట డివిజన్‌లోని ఓల్డ్‌కస్టమ్స్ బస్తీలో జరిగిన సమావేశానికి ఆమె హాజరయ్యారు. ఖబరస్తాన్‌కు మున్సిపల్, రెవెన్యూ నుంచి అధికారిక అనుమతి లేకపోవడం వల్ల డెత్ సర్టిఫికెట్లు రావడం లేదని, దీని వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు నీలిమ దృష్టికి తీసుకొచ్చారు. సమావేశంలో నాయకులు సలీంఖాన్, విశాల్ సుధాం, హనీఫ్‌ఖాన్, మునీర్‌ఖాన్, బబ్లూ పాల్గొన్నారు.

వెంగళరావునగర్‌లో పెట్రోలింగ్ పెంచాలి

వెంగళరావునగర్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): వెంగళరావునగర్ కాలనీలో పెట్రోలింగ్ పెంచాలని కాలనీ సంక్షేమ సమితి అధ్యక్షుడు చిలకల వెంకటేశ్వరరావు కోరారు. మధురానగర్ పీఎస్ ఇన్‌స్పెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ప్రభాకర్ ను సమితి ప్రతినిధులతో శనివారం కలిశారు. కాలనీలోని ప్రధాన, అంతర్గత రహదారులలో పెట్రోలింగ్ పెంచాలని వారు కోరారు. కార్యక్రమంలో సమితి ప్రధాన కార్యదర్శి శౌరిరాజు, ఎస్.అర్జున్, డి.ధనుంజయరెడ్డి, టి.ఉదయభాస్కర్, ముత్తయ్య, శ్రీధర్ పాల్గొన్నారు.

మద్యం మత్తులో వాహనం నడిపిన ఐదుగురి అరెస్ట్

బంజారాహిల్స్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో కారు నడుపుతూ పట్టుబడిన ఐదుగురు వ్యక్తులను ఫిలింనగర్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. షేక్‌పేట ఓయూకాలనీలో నివాసముంటున్న వడ్ల వెంకటేష్ కారు డ్రైవర్. శుక్రవారం రాత్రి తన స్నేహితులు శ్రీను, కిరణ్, అనిల్‌తో కలిసి అర్ధరాత్రి 12 దాకా మద్యం తాగారు. మద్యం మత్తులో వెంకటేష్ ఓయూ కాలనీలోని తన గదికి వెళ్తుండగా తమ ఇంటి ఎదుట పార్కు చేసిన కారును ఢీకొట్టాడని బాధితుడు అజారుద్దీన్ ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కారులో ఉన్న నలుగురు మద్యం తాగినట్లు నిర్ధారించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో..

ఫిలింనగర్‌లోని అపోలో ఆస్పత్రి సమీపంలో మణికొండకు చెందిన హరీష్ డిజైనర్ బోటిక్ నిర్వహిస్తున్నాడు. శుక్రవారం రాత్రి 11 గంటల ప్రాంతంలో మద్యం తాగి కారులో ఇంటికి బయలుదేరాడు. ఫిలింనగర్‌లోని మహనీయుల చౌరస్తా వద్దకు చేరుకోగానే అదుపుతప్పి వేగంతో రఘుపతి వెంకయ్య విగ్రహం దిమ్మని ఢీకొట్టాడు. ఈ ఘటనలో దిమ్మె పూర్తిగా దెబ్బతినగా కారు ముందు భాగం ధ్వంసమైంది. హరీష్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడ చేరుకొని హరీష్‌కు బ్రీత్ అనలైజర్ పరీక్ష చేసి మద్యం తాగినట్లు నిర్ధారించారు.



ట్రంపెట్ ఫెస్టివల్ ర్యాలీలో కోట నీలిమ, క్రైస్తవ ప్రతినిధులు సెల్వరాజ్ తదితరులు

అందరి పట్ల ప్రేమను కలిగి ఉండాలి

బేగంపేట, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): అందరి పట్ల ప్రేమను కలిగిఉండాలనే క్రీస్తు మాటలను ప్రతి ఒక్కరూ అనుసరించాలని సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కోట నీలిమ అన్నారు. శనివారం బేగంపేటలోని వెస్లీ కళాశాలలో సెల్వరాజ్ ఆధ్వర్యంలో గ్రేటర్ హైదరాబాద్ ట్రంపెట్ ఫెస్టివల్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని క్రైస్తవ ప్రముఖులు విన్‌స్టన్, దీపక్‌జాన్, విల్సన్ సింఘం, కాంగ్రెస్ నేత కోట నీలిమ జెండా ఊపి ప్రారంభించారు. రెండోసారి క్రీస్తు రాక అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ర్యాలీ నిర్వహించినట్లు సెల్వరాజ్ తెలిపారు. కార్యక్రమంలో సంపత్‌కుమార్, జవహర్ కెనడి, ఫ్రాంక్లిన్, డేవిడ్, డీన్, అశోక్‌కుమార్, సమి పాల్గొన్నారు.

ప్రెస్టిజియస్ కాంప్రిహెన్సివ్ స్ట్రోక్ సెంటర్‌గా అపోలో

బంజారాహిల్స్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ అపోలో ఆస్పత్రికి గుండె నొప్పితో వచ్చిన రోగులకు తక్షణ చికిత్స అందించినందుకు ఆస్పత్రి సేవలను గుర్తించి ప్రెస్టిజియస్ కాంప్రిహెన్సివ్ స్ట్రోక్ సెంటర్‌గా అమెరికన్ హార్ట్ అసోసియేషన్(ఏహెచ్ఏ) గుర్తించింది. ఈ మేరకు ఆస్పత్రి ప్రతినిధులకు సర్టిఫికెట్‌ను అందజేసింది. ఈ తరహా సర్టిఫికెట్ పొందిన మొదటి ఆస్పత్రిగా నిలిచినట్లు అపోలో ఆస్పత్రుల తెలంగాణ రీజియన్ సీఈఓ తేజస్వీరావు తెలిపారు. హాస్పిటల్ ఎమర్జెన్సీ హెడ్ డా. ఇమ్రాన్ సుల్తాన్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా మరణాలకు గుండె సంబంధిత వ్యాధులే ప్రధాన కారణాలు అవుతున్నాయన్నారు. ప్రోటోకాల్, టెక్నాలజీని వినియోగించి ప్రత్యేక సేవలందిస్తున్నట్టు చెప్పారు. కార్డియాలజిస్ట్ డాక్టర్ మనోజ్ అగర్వాల్ మాట్లాడుతూ ఈ సర్టిఫికెట్‌తో తమ బాధ్యత పెరిగిందని పేర్కొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్వాడీ టీచర్లు

చిన్నారులను అంగన్వాడీ బడిలో చేర్పించాలి

బోరబండ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): చిన్నారులను అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ లోవకుమారి కోరారు. బోరబండ బలహీనవర్గాల కాలనీ జయంత్‌నగర్, జ్యోతినగర్ అంగన్వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో చిన్నారులతో శనివారం ర్యాలీ నిర్వహించారు. ఆయా కేంద్రాల్లో చేరిన చిన్నారులకు టీచర్లు కె.నిర్మల, ఆర్.శాంత, జె.నాగేశ్వరమ్మ స్వాగతం పలికారు.



నృత్యం చేస్తున్న కళాకారులు

ఆకట్టుకున్న కూచిపూడి నృత్యం

మాదాపూర్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): మాదాపూర్‌లోని శిల్పారామంలో శనివారం సంగీత నాటక అకాడమీ వారి కూచిపూడి నాట్య గురువర్యులు మద్దాలి ఉషాగాయత్రీ వారి శిష్య బృందంచే 'కూచిపూడి విభావరి' ప్రదర్శించారు. వాతాపి గణపతి, స్వామినాథ, శివదీక్ష, ప్రహ్లాద పట్టాభిషేకం, బాల కనకమయ, చక్కని తల్లి, కృష్ణజనన శబ్దం, అలరులు కురియగా, గొల్లకలాపం, తిల్లాన అంశాలను వాసవి చౌదరి, ఆశ్రిత షిండే, యశస్విని, శ్రద్ధ వారణాసి, సహస్ర, చేరిష్య ప్రదర్శించి ప్రేక్షకుల మదిని దోచుకున్నారు.

వెంగళరావునగర్‌లో బీజేపీని బలోపేతం చేస్తాం : కిలారి

వెంగళరావునగర్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): వెంగళరావునగర్ డివిజన్‌లో భారతీయ జనతా పార్టీ(బీజేపీ)ని బూత్ స్థాయి నుంచి బలోపేతం చేస్తామని ఆ పార్టీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు,మాజీ కార్పొరేటర్ కిలారి మనోహర్ అన్నారు. శనివారం వెంగళరావునగర్ కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో డివిజన్ కమిటీని ఆయన ప్రకటించారు. అధ్యక్షుడిగా ఎస్.నవీన్ కుమార్, ఉపాధ్యక్షులుగా ఎం.శ్రావణ్ కుమార్, బి.శివకుమార్, ఎస్.శ్రావణ్ కుమార్, బి.అర్జున్, ఎస్.నర్సింగరావు, కె.హరిబాబు, ప్రధాన కార్యదర్శులుగా టి.రాఘవేంద్ర, కె.అరవింద్, ఆర్.వి.వరలక్ష్మి, కోశాధికారిగా పి.లీల, కార్యదర్శులుగా ఎం.భాస్కర్, టి.నరేష్, కె.రోజారాణి, ఎన్.రఘు, ఎల్.వెంకటకృష్ణ, సతీష్, మహిళా మోర్చా అధ్యక్షురాలిగా ఈ.నర్మద, ఎస్సీ మోర్చా అధ్యక్షుడిగా రమేష్, యువమోర్చా అధ్యక్షుడిగా కళ్యాణ్ యాదవ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ కేంద్రం ప్రవేశపెడుతున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సెంట్రల్ జిల్లా కార్యదర్శి సుప్రియగౌడ్, మైనారిటీ మోర్చా ఉపాధ్యక్షుడు జబ్బార్, శ్యామ్, వై.రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.



ఉత్పత్తులను పరిశీలిస్తున్న సందర్శకులు

మొదలైన సిల్క్ ఇండియా ప్రదర్శన

బంజారాహిల్స్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): వేడి తగ్గింది. వర్షాలు పడుతున్నాయి. మరోవైపు శుభకార్యాలు, వివాహాలు జరుగుతున్నాయి. ఈ సమయంలో వాతావరణాన్ని తట్టుకుంటూ కాస్త ఫ్యాషనబుల్‌గా ఉండే ఉత్పత్తులను కొనుగోలు చేసేందుకు ప్రజలు మొగ్గు చూపిస్తుంటారు. ఈ నేపథ్యంలో శ్రీనగర్‌కాలనీ సత్యసాయినిగమాగమంలో న్యూ క్రాఫ్ట్ ఆధ్వర్యంలో సిల్క్ ఇండియా వస్త్ర ప్రదర్శన మొదలైంది. మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, భాగల్‌పూర్, కాంతావర్క్, హ్యాండ్ బ్లాక్, ప్రింటెడ్ శారీస్, లినెన్ శారీస్, కలంకారి, బెంగాల్ కాటన్, లేడీస్ ఫ్యాన్సీ టాప్స్, డిజైనర్ జాకెట్‌లు, లక్నోచికాన్, బనారస్ శారీస్, ఖాదీ మెటీరియల్, వన్‌గ్రామ్ గోల్డ్ జువెలరీ వంటివి మహిళలను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. దేశవ్యాప్తంగా 14 నగరాలకు చెందిన చేనేత కారులు తమ ఉత్పత్తులను 70కి పైగా స్టాల్స్‌లో పెట్టి వినియోగదారులకు అందుబాటులో ఉంచారు. ప్రదర్శన ప్రవేశం ఉచితం అని నిర్వాహకులు తెలిపారు. ప్రదర్శన జూన్ 22 వరకు కొనసాగుతుందని నిర్వాహకుడు మానస ఆచార్య తెలిపారు.



మాగంటి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ రాజ్‌కుమార్ పటేల్, బీఆర్ఎస్ నాయకులు

మాగంటి సేవలు మరువలేం

యూసుఫ్‌గూడ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ సేవలను జూబ్లీహిల్స్ ప్రజలు ఎన్నటికీ మరువ రని కార్పొరేటర్ బండారి రాజ్‌కుమార్ పటేల్ అన్నారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో లక్ష్మీనరసింహ నగర్‌లో మాగంటి గోపీనాథ్ సంతాపసభను శనివారం నిర్వహించారు. మాగంటి చిత్రపటానికి నాయకులు, కార్యకర్తలు నివాళులర్పించారు. అనంతరం రాజ్‌కుమార్ పటేల్ మాట్లాడుతూ బలహీన వర్గాల ఆర్థిక అభివృద్ధికి, బస్తీలు, కాలనీల సంక్షేమానికి మాగంటి ఎంతో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో డివిజన్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఐలపాక నర్సింగ్‌దాస్, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి వినియోగిస్తున్న యువకుడు అరెస్టు

బంజారాహిల్స్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): గంజాయి వినియోగిస్తున్న యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. బంజారాహిల్స్ రోడ్డునెంబర్. 12 మిథులానగర్‌లో యువకుడు గంజాయి తాగుతున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. దీంతో దాడులు నిర్వహించిన పోలీసులు సయ్యద్ ఇబ్రహీం అలియాస్ కేస్ అనే యువకుడిని అదుపులోకి తీసుకొని ప్రశ్నించగా కొంతకాలంగా గంజాయికి అలవాటు పడినట్లు ఒప్పుకున్నాడు. అతడి నుంచి 5.7 గ్రాముల గంజాయి, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్న బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీఎంకు కృతజ్ఞతలు : కోట నీలిమ


ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసిన కోట నీలిమ

సికింద్రాబాద్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గం ఇన్‌చార్జి కోట నీలిమ శనివారం కలిశారు. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలిగా నియమించినందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్‌తోపాటు యావత్ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు, రాష్ట్రాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఆమె చెప్పారు. కాగా సనత్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు చురుగ్గా ఉన్నారని, కాలనీలు, బస్తీల్లో పర్యటిస్తూ, ప్రజా సమస్యలు తెలుసుకుంటున్నారని, అనంతరం ఆయా విభాగాల అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నారని నీలిమ వివరించారు.


మంత్రి పొన్నంను కలిసిన ఉద్యోగుల సంఘం నేతలు

ఆర్టీసీ బీసీ ఉద్యోగుల మహాసభకు రండి

సికింద్రాబాద్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఈ నెల 24న నిర్వహించనున్న ఆర్టీసీ బీసీ ఉద్యోగుల రాష్ట్ర మహాసభకు రావలసిందిగా రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఉద్యోగుల సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు. ఆర్టీసీ బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తిరుపతయ్య, ప్రధాన కార్యదర్శి నిరంజన్, సికింద్రాబాద్ రీజియన్ గౌరవాధ్యక్షుడు గుర్రం పవన్‌కుమార్‌గౌడ్, కృష్ణ, వెంకయ్య, సి.హెచ్.రావు, సంపత్, పాండు తదితరులు శనివారం మంత్రిని కలిశారు. ఈ నెల 24న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే ఆర్టీసీ బీసీ ఉద్యోగుల మహాసభకు రావాలని ఆహ్వానించారు. ఆర్టీసీలో పని చేస్తున్న బీసీ ఉద్యోగుల సమస్యలు, బీసీల ఆరాధ్య దైవమైన జ్యోతిరావు పూలే జయంత్యుత్సవాలను ఆర్టీసీ యాజమాన్యం తరఫున నిర్వహించడం తదితర అంశాలను మహాసభలో చర్చించనున్నట్లు ఈ సందర్భంగా గుర్రం పవన్‌కుమార్‌గౌడ్ వెల్లడించారు.


పెయిన్ క్లినిక్ సమావేశానికి హాజరైన వైద్యులు

పెయిన్ క్లినిక్‌లో సరైన వైద్యం

అడ్డగుట్ట, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : పెయిన్ క్లినిక్‌లో సరైన వైద్యం అందుతుందని అనస్తీషియా విభాగాధిపతి ప్రొఫెసర్ మునీశ్వర్ తెలిపారు. శనివారం గాంధీ మెడికల్ కాలేజీలో జరిగిన అనస్తీషియా విభాగంలోని సీఎంఈ సమావేశంలో దాదాపు వందమంది వివిధ విభాగాలకు చెందిన వైద్యులు, పీజీలు, జూడాలు పాల్గొన్నారు. పెయిన్ క్లినిక్ వల్ల లాభాలపై ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ పద్మావతి వివరించి చెప్పడం జరిగిందన్నారు. త్వరలో ఈ పెయిన్ క్లినిక్‌కు రూ.20 లక్షలు పెయిన్ క్లినిక్ వైద్య యంత్రాలను అందజేస్తానని తెలిపారు. కార్యక్రమానికి గాంధీ సూపరింటెండెంట్ రాజకుమారి, గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ ఇందిర పాల్గొన్నారు.

నేడు త్యాగరాజ పంచరత్న గాన గోష్ఠి


సద్గురు త్యాగరాజ స్వామి

చిలకలగూడ, జూన్ 14(ఆంధ్రజ్యోతి): శ్రీ చంద్రశేఖరేంద్ర ఎడ్యుకేషనల్ అకాడమీ ఆధ్వర్యంలో వెస్ట్ మారేడుపల్లి, కళాసాగర్ మీనాక్షి సుందరం హాల్‌లో కంచి పరమాచార్య చంద్రశేఖరేంద్ర స్వామి, వాగ్గేయకారుడు త్యాగరాజస్వామి జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం 9.30కి సంగీత విద్వాంసుడు ఎన్.రామమూర్తి ఆధ్వర్యంలో కర్నాటక గాత్ర కళాకారులతో కలిసి త్యాగరాజ పంచరత్న కీర్తనల గోష్ఠి గానం నిర్వహించనున్నారని ఇందుకు ఏర్పాట్లు గావించినట్లు అకాడమీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తెలిపారు. సాయంత్రం 5.30కి మండా అనంతకృష్ణ వేణుగాన కచేరి, 7 గంటలకు సంగీతరత్న పి.శ్రీనివాస గోపాలన్ మృదంగ వాద్య కచేరి జరుగుతుంది. సంగీత ప్రియులు అధిక సంఖ్యలో పాల్గొనాలని నిర్వాహకులు కోరుతున్నారు.


కేసులు పరిష్కరిస్తున్న మహిళా జడ్జి షౌకత్ జహాన్ సిద్దిఖ్యా

లోక్ అదాలత్‌లో పెండింగ్ కేసుల పరిష్కారం

అడ్డగుట్ట, జూన్ 14(ఆంధ్రజ్యోతి) : జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో భాగంగా శనివారం సికింద్రాబాద్ సివిల్‌కోర్టులోని 12వ అదనపు కోర్టులో చీఫ్ మహిళా జడ్జి షౌకత్ జహాన్ సిద్దిఖ్యా పెండింగ్ కేసులను పరిష్కరించారు. లోక్ అదాలత్‌లో 87 మోటార్ యాక్ట్ కేసులు, 36 వివిధ బ్యాంకులకు సంబంధించిన పెండింగ్ సమస్యలు పరిష్కారమయ్యాయి. ఇదేవిధంగా ఫ్యామిలీకి సంబంధించిన కేసులు పరిష్కారం కావడంతో ఇరు పార్టీల అర్జీదారులు ఆనందం వ్యక్తం చేశారు.

తాగునీటి వృథాను అరికట్టండి


దూద్‌బావి చర్చి వద్ద వృథాగాపోతున్న తాగునీరు

చిలకలగూడ, జూన్ 14(ఆంధ్రజ్యోతి): మెట్టుగూడ డివిజన్ చిలకలగూడ, దూద్‌బావి చర్చి, మెట్టుగూడ ప్రైజన్స్ స్టైలాట్ టర్నింగ్ వద్ద వృథాగా పోతున్న తాగునీరును అరికట్టాలని స్థానికుడు ఎం.డి. ఫిరోజ్ తెలిపారు. రోడ్డుపై నీరు నిలవటం వల్ల వాహనదారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, అనవసరంగా నీరు వృథా అవుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నిమార్లు ఫిర్యాదు చేసిన అధికారులు పట్టించుకోవడం లేదని సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరారు.

హామీల అమలులో విఫలం

చిలకలగూడ, జూన్ 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని మహంకాళి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి విమర్శించారు. చిలకలగూడ, దూద్‌బావిలో శనివారం బీజేపీ సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం అమలులో విఫలమైందని, అన్ని రంగాలలో ప్రగతి కుంటు పడిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఈశ కమిటీ సభ్యులుగా శారద మల్లేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవి ప్రసాద్‌గౌడ్, మెట్టుగూడ డివిజన్ అధ్యక్షుడు ఆదర్శ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

- లాడ్జి నిర్వాహకులకు పోలీసుల సూచన
- ఒంటరిగా వచ్చేవారితో అప్రమత్తం
- ఐడీ కార్డు, మొబైల్ నంబరు తప్పనిసరి


లాడ్జి నిర్వాహకులతో సమావేశమైన గోపాలపురం సీఐ మధుకుమార్

అడ్డగుట్ట, జూన్ 14(ఆంధ్రజ్యోతి): వాణిజ్య కేంద్రంగా పేరున్న సికింద్రాబాద్‌లో లాడ్జి నిర్వాహకులకు గోపాలపురం పోలీసులు ఎప్పటికప్పుడు సూచనలిస్తున్నారు. లాడ్జిలో బస చేయడానికి వచ్చే వారిపై అప్రమత్తంగా ఉంటూ ప్రతి ఒక్కరి నుంచి ఐడీ కార్డు తీసుకోవాలని తెలిపారు.

బస చేస్తున్న వారిపై నిఘా ఉంచాలి

లాడ్జిలో బసచేస్తున్న వారి గదులకు వెళ్లి ఒకటికి రెండుసార్లు తనిఖీలు చేయాలి. ఎవరు ఏం చేస్తున్నారు, ఎందుకు ఇన్ని రోజులు ఉంటారన్న కోణంలో లాడ్జి నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలి.

డార్మిటరీలో ఉండే వారిని గమనించాలి

హైదరాబాద్‌లో పనిచేయడానికి కొందరు వివిధ రాష్ట్రాల నుంచి పనికోసం వచ్చి పనిదొరికే వరకు డార్మెటరీల్లో ఉంటుంటారు. కొందరు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేందుకు కూడా రావచ్చు. అందుకని నిర్వాహకులు ఇలాంటి వారి విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఇటీవల గోపాలపురం పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన లాడ్జి నిర్వాహకుల సమావేశంలో ఈ అంశాలు గుర్తు చేశారు. మద్య రాత్రి ఎవరు కూడా బయటికి వెళ్లకుండా జాగ్రత్త పడాలి. లాడ్జిలు, డార్మెటరీల్లో పనిచేయడానికి వచ్చే వారి నుంచి ఐడీ, ఆధార్‌కార్డుతో పాటు కుటుంబ సభ్యుల ఆధార్ కార్డులు, ఫోన్ నంబర్లు తీసుకుని పనిలో పెట్టుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అలాగే సిబ్బంది పనితీరును కూడా లాడ్జి యజమానులు గమనించాల్సి ఉంటుంది.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



గోపాలపురం పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న అన్ని లాడ్జిలు, డార్మెటరీలు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. రెండు నెలల పాటు రికార్డు ఉండేవిధంగా ఫుటేజీలు భద్రపరుచుకోవాలి. లాడ్జిలకు వచ్చేవారి నుంచి ఐడీ కార్డులు, ఫోన్ నంబర్లు తీసుకోవాలి. అలాగే ఇచ్చిన ఫోన్ నంబరు పనిచేస్తుందా లేదా అన్నది చెక్ చేయాలి.

చాలా రోజుల నుంచి బస చేసే వారిని గమనించాలి. లాడ్జిలకు వచ్చేవారు అనుమానితులైతే తమకు నేరుగా ఫోన్ చేసి సమాచారం ఇవ్వవచ్చు. వారి పేర్లను గోప్యంగా ఉంచుతాం. రాత్రి సమయాల్లో లాడ్జిలో తనిఖీలు చేస్తున్నాం. వచ్చే బోనాల ఉత్సవాల సందర్భంగా పోలీస్‌స్టేషన్ పరిధిలో అప్రమత్తంగా ఉన్నాం.

- సీఐ మధు కుమార్

టాయిలెట్స్ నిర్మించేలా చర్యలు తీసుకుంటాం

- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్


ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు వినతిపత్రం అందజేస్తున్న క్లాత్ మర్చంట్స్ ప్రతినిధులు

మారేడుపల్లి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : టొబాకో బజార్‌లో నూతన టాయిలెట్స్ నిర్మించేలా చర్యలు తీసుకుంటామని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ హామీ ఇచ్చారు. శనివారం ఈ జనరల్ బజార్‌లోని టొబాకో బజార్‌కు చెందిన క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు వెస్ట్ మారేడుపల్లిలోని కార్యాలయంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జనరల్ బజార్‌లోని నాలుగు ప్రాంతాల్లో టాయిలెట్స్ నిర్మించేందుకు అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అసోసియేషన్ ప్రతినిధులు ప్రకాష్, సభ్యులు జంగిటి మురళి, రాంమోహన్ యాదవ్, చౌకాని తదితరులు ఉన్నారు.

ఎల్ఓసీ అందజేత

సీఎం సహాయనిధిని సద్వినియోగం చేసుకుని మెరుగైన వైద్యం చేయించుకోవాలని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శనివారం వెస్ట్ మారేడుపల్లిలోని తన కార్యాలయంలో బేగంపేట డివిజన్ భగవంతాపూర్‌కు చెందిన గౌతమికి చికిత్స కోసం మంజూరైన రెండు లక్షల 50 వేల రూపాయల ఆర్థిక మంజూరుపత్రం (ఎల్‌ఓసీ)ని ఆమె తల్లికి ఎమ్మెల్యే అందజేశారు.

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి చర్యలు

చిలకలగూడ, జూన్ 14(ఆంధ్రజ్యోతి): భారతీయ రైల్వేలో పదవీ విరమణ చేసిన పెన్షనర్లకి 8వ వేతన సంఘం అమలులో మెరుగైన పెంపుకే కృషి చేస్తామని నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రైల్వేమెన్, దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ ప్రధాన కార్యదర్శి మర్రి రాఘవయ్య పేర్కొన్నారు. శనివారం సఫిల్‌గూడలో ఆధునీకరించిన పెన్షనర్ల కార్యాలయాన్ని లాంఛనంగా ప్రారంభించి అనంతరం మాట్లాడుతూ పెన్షనర్లకి మెరుగైన వైద్య సౌకర్యాలు, 7వ వేతన సంఘం అమలులో అవకతవకల సవరణ, నూతన పే కమిషన్ మెరుగైన ప్రత్యేకత తమ వంతు కృషి చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో సంఘ్ సహాయ ప్రధాన కార్యదర్శి భరణి భాను ప్రసాద్, పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రామకృష్ణాచార్యులు, ఎ.జి.కె.మూర్తి పెన్షనర్లు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్ట్

తిరుమలగిరి జూన్ 14 (ఆంధ్రజ్యోతి): పార్కు చేసిన ద్విచక్ర వాహనాల దొంగతనాలకు పాల్పడుతున్న ఓ యువకుడిని శనివారం తిరుమలగిరి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం తిరుమలగిరి ఎయిర్‌లైన్స్ కాలనీలో పార్క్ చేసిన ద్విచక్ర వాహనాన్ని గత నెల 29న ముషీరాబాద్ బోలక్‌పూర్ ప్రాంతానికి చెందిన అబ్దుల్ ముజాహిద్ హుస్సేన్(22) దొంగిలించాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సుమారు 50 సీసీ కెమెరాలను పరిశీలించి నిందితుడిని గుర్తించి అరెస్టు చేశారు. మూడు కమిషనరేట్ల పరిధిలోని పలు పోలీస్ స్టేషన్లలో నిందితుడిపై ఆరు కేసులు ఉన్నట్టుగా పోలీసులు గుర్తించారు. ఈ మేరకు శనివారం పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు.

కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్య


శ్రావణి(ఫైల్)

బేగంపేట, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డలో కుటుంబకలహాలతో ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు జిల్లా తిమ్మాపురం గ్రామానికి చెందిన శ్రావణి (30) ఉపాధి కోసం కుటుంబంతో నగరానికి వచ్చి ఎర్రగడ్డలో నివసిస్తుంది. సమీపంలోని జనప్రియ అపార్ట్‌మెంట్‌లో హౌస్ కీపింగ్ పనులు చేసుకుంటూ ఉపాధి పొందుతుంది. కుటుంబ కలహాల వల్ల మానసికంగా కుంగిపోయిన ఆమె ఉదయం 8.30 గంటల సమయంలో జనప్రియ అపార్ట్‌మెంట్ పైఅంతస్తు నుంచి కిందకు దూకి ఆత్మహత్య చేసుకుంది. తీవ్రంగా గాయపడిన ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. మృతురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


పుష్పగిరి శంకర భారతీ మహాస్వామి ఆశీస్సులు తీసుకుంటున్న భక్తులు

రాజరాజేశ్వరీదేవి నవదశ వార్షికోత్సవ పూజలు

రెజిమెంటల్‌బజార్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ కుమ్మరిగూడలోని శ్రీమదభినవ మఠం శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో శ్రీరాజరాజేశ్వరీదేవి నవదశ వార్షికోత్సవ పూజలు శనివారం ముగిశాయి. పుష్పగిరి శంకర భారతీ మహాస్వామి ఆధ్వర్యంలో శాంతి హోమం, మండప దేవత హోమాలు, అష్టోత్తర శత కలశాభిషేకం, మహాపూర్ణాహుతి పూజలు జరిగాయి. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కొత్త వీరలక్ష్మి, ఎస్ఎస్ కుమార్, గున్నాల ప్రభావతి, లలిత పారాయణ సత్సంగ్ సభ్యులు భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశారు.


కల్యాణ వేంకటేశ్వరస్వామికి పూజలు చేస్తున్న ఆలయ చైర్మన్ నోముల ప్రకాశరావు ఇందిరా తదితరులు

కనుల పండువగా కల్యాణోత్సవం

బోడుప్పల్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): నామాలగుండులోని కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి కల్యాణోత్సవం శనివారం కనులపండువగా జరిగింది. ఆలయ చైర్మన్ నోముల ప్రకాశరావు ఇందిరా దంపతుల ఆధ్వర్యంలో మంగళ వాయిద్యాలు, వేద పండితుల మంత్రోచ్ఛరణతో కల్యాణోత్సవం అంగరంగవైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కటారి రాజు, బిల్ల రఘునందన్ కుమార్, నాగులూరి శ్రీనివాస్‌గౌడ్, సతీష్‌కుమార్, రవి తదితరులు పాల్గొన్నారు.


స్టాల్స్‌లో దుస్తులను పరిశీలిస్తున్న మహిళలు

ఆకట్టుకుంటున్న చేనేత హస్తకళా ప్రదర్శన

పద్మారావునగర్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : షాపింగ్ ప్రియులు కొత్తగా దొరికే ఉత్పత్తులపై ఆసక్తి చూపుతున్నారు. వివాహాది శుభకార్యాలతో పాటు ఫ్యాషనబుల్‌గా ఉండే వస్త్రాలను మహిళలు కోరుకుంటున్నారు. ఈ నేపథ్యంలో పద్మారావునగర్‌లోని కొత్త కామకోటి కల్యాణ నిలయం హాల్‌లో కళా సిల్క్స్ ఆధ్వర్యంలో చేనేత హస్త కళాప్రదర్శన ప్రారంభమైంది. మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, బాగల్‌పూర్, కాంతావర్క్స్, హ్యాండ్ బ్లాక్, ప్రింటెడ్ శారీస్, లినెన్ శారీస్, కలంకారి, బెంగాల్ కాటన్, లేడీస్ ఫ్యాన్సీ టాప్స్ డిజైనర్ జాకెట్లు, లక్నో చికన్, బనారస్ శారీస్, బాటిక్ మెటీరియల్, వన్‌గ్రామ్ గోల్డ్ జువెలరీ వంటివి మహిళలను ఆకట్టుకుంటున్నాయి. దేశవ్యాప్తంగా 14 నగరాలకు చెందిన చేనేతకారులు తమ ఉత్పత్తులను 70కి పైగా స్టాల్స్‌లో పెట్టి వినియోగదారులకు అందుబాటులో ఉంచారు. ప్రదర్శన ప్రవేశం ఉచితమని, మరో వారం రోజుల్లో ప్రదర్శన ముగుస్తుందని నిర్వాహకులు తెలిపారు.

సికింద్రాబాద్ సిటీ సివిల్ కోర్టులో జాతీయ లోక్ అదాలత్

- సీనియర్ చీఫ్ జడ్జి శశిధర్‌రెడ్డి


సికింద్రాబాద్ సివిల్ కోర్టును సందర్శించిన జడ్జి శశిధర్‌రెడ్డి

అడ్డగుట్ట, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ సివిల్ కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో హైదరాబాద్ కోర్టుల ఇన్‌చార్జి, సీనియర్ చీఫ్ జడ్జి శశిధర్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఆయన కోర్టులో నెలకొన్న సమస్యలను న్యాయవాదులను అడిగి తెలుసుకున్నారు. జడ్జి వెంట డాక్టర్ ఎం.శ్యామ్ శ్రీ ఫ్యామిలీ కోర్టు జడ్జి, షౌకత్ జహాన్ సిద్దిఖ్యా సికింద్రాబాద్ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి జనార్దన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు మల్లికార్జున్, సంయుక్త కార్యదర్శి వినోద్‌కుమార్ తాండ్రే, లేడీ రిప్రజెంటేటివ్ మహేశ్వరి, కోశాధికారి సురేష్, స్పోర్ట్స్ కల్చరల్ కార్యదర్శి మురళీధర్ యాదవ్, లైబ్రరీ కార్యదర్శి స్వామి, సీనియర్ న్యాయవాది శ్రీరాములు, కార్యవర్గ సభ్యులు సంతోష్, సంజీవ్ కుమార్, పావని, నమత, అనితలు పాల్గొన్నారు.



రక్తదానం

ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా గాంధీ ఆస్పత్రిలో వివిధ విభాగాలకు చెందిన వైద్యులు రక్తదానం చేశారని గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజకుమారి తెలిపారు.

- (అడ్డగుట్ట, ఆంధ్రజ్యోతి)

రైలు ప్రయాణికులకు భద్రత సూచనలు

- రైలు పట్టాలు దాటకూడదు
- ఆపద వస్తే 139 కాల్ చేయండి
- ఆర్పీఎఫ్ సీఐ సరస్వతి


ప్రయాణికులకు భద్రత విషయంలో సూచనలు ఇస్తున్న ఆర్పీఎఫ్ ఎస్సై వెంకటరెడ్డి


డ్రెస్ పాస్ చేస్తున్న ప్రయాణికులకు సూచనలిస్తున్న ఆర్పీఎఫ్ ఎస్సై వెంకటరెడ్డి

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, జూన్ 14(ఆంధ్రజ్యోతి) : రైల్లో ప్రయాణం చేసే సమయంలో ప్రయాణికులు జాగ్రత్తగా ఉండాలని, ఆపద వస్తే 139 నెంబర్‌కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని సికింద్రాబాద్ ఆర్పీఎఫ్ సీఐ సరస్వతి, ఎస్సై వెంకటరెడ్డిలు ప్రయాణికులకు సూచించారు. శనివారం రైల్వే ఆపరేషన్ సురక్ష కింద ప్రయాణికులకు రైల్వే పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చారు. రైళ్లలో ప్రయాణం చేస్తున్న సమయంలో బంగారు ఆభరణాలు ఆధికంగా ధరించకూడదు, కిటికీల వద్ద కూర్చున్న ప్రయాణికులు జాగ్రత్తగా ఉండాలి. ముఖ్యంగా ప్రధాన కూడళ్ల వద్ద రైలు పట్టాలు దాటకూడదని సూచించారు. రైళ్లు వెళుతున్న సమయంలో రైలు పట్టాల పక్కన కొంతమంది పోకిరీలు రాళ్లు వేస్తుంటారని, ఇలాంటి చేష్టలకు పాల్పడితే రైల్వే యాక్ట్ ప్రకారం చర్యలు ఉంటాయని సూచించారు. రైల్వే స్టేషన్‌లో వివిధ ప్లాట్ ఫాంపై రైలు పట్టాలు దాటుతున్న ప్రయాణికులకు కౌన్సిలింగ్ ఇచ్చి మరోసారి రైలు పట్టాలు దాటవద్దని రైల్వే పోలీసులు ప్రమాణం చేయించారు.